సాంకేతిక విప్లవంతో భారత్ ముందంజ



సనత్‌నగర్: సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించే అవకాశం ఉందని ఢిల్లీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్‌ఐఎస్‌డీసీ) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సచిన్ చతుర్వేది అభిప్రాయపడ్డారు. ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం సెస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సచిన్ చతుర్వేది 'సాంకేతికతతో సమానమైన అభివృద్ధి–ప్రపంచ దక్షిణ భారతదేశం అనుభవం' అనే అంశంపై మాట్లాడారు. మన దేశం సాంకేతికపరంగా మరింత అభివృద్ధి చెందాలంటే వ్యూహాత్మక–ప్రణాళిక, భాగస్వామ్య అభివృద్ధి, సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యం, వ్యవసాయం, బ్యాంకింగ్‌తో పాటు కీలక రంగాల్లో అడ్డంకులను తొలగించడం ఎంతో కీలకమన్నారు. సాంకేతిక పురోగతిలో భారతదేశ నాయకత్వాన్ని ఎలుగెత్తి చూపడమే కాకుండా ప్రపంచ దక్షిణాది దేశాలకు సాంకేతిక పరిజ్ఞాన నిధిని అందించిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), డిజిటల్ పబ్లిక్ గూడ్స్ (డీపీజీ) అనేవి ప్రభుత్వ పెట్టుబడితో ఆవిర్భవిస్తాయన్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఆధార్ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), కోవిడ్, ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్ వంటి కార్యక్రమాలు డిజిటల్ విప్లవానికి చిహ్నమన్నారు. సాంకేతిక విప్లవాభివృద్ధిపై ఆర్థిక, సామాజిక అంశాల అధ్యయన కేంద్రం అధ్యాపకులు విశ్లేషణాత్మకంగా పరిశోధనలు చేయాలని చతుర్వేది పిలుపునిచ్చారు. సెస్ వ్యవస్థాపక సభ్యులు, ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెస్ డైరెక్టర్ రేవతి, ప్రొఫెసర్ హన్మంతరావు, డాక్టర్ జీఆర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ రవి, డాక్టర్ కేపీ గోయెల్, ప్రొఫెసర్ బలరాములు, డాక్టర్ అలివేలుతో పాటు సెస్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



అక్రమ పార్కింగ్ వాహనాలను తొలగిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌ల కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వారాంతపు సంత సమయంలో నానా అవస్థలు పడుతున్నామంటూ.. పలువురు వాపోయారు. అక్రమ పార్కింగ్‌ల కారణంగా నిత్యం రోడ్లపై ప్రమాదాలు సంభవిస్తున్నాయి, ముఖ్యంగా వారాంతపు సంత సమయాల్లో నరకం అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 'సాక్షి'లో 'ఎవరి వాహనాలో.. ఎందుకు నిలిపారో..' అంటూ శీర్షిక ప్రచురితమైంది. దీనికి స్పందించిన చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు స్పందించి లాలాగూడలో రైల్వే క్వార్టర్స్ సమీపంలోని ప్రధాన రోడ్లపై అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను తొలగించారు.

చర్యలు తప్పవు..



అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గతంలోనూ అక్రమ పార్కింగ్‌లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. తీరుమార్చుకోకుండా యథాతథంగా ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇకపై అక్రమ పార్కింగ్‌లు చేస్తే చాలన్లతో పాటు కేసులు కూడా నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

– శ్రీనివాసులు, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ

న్యూసెన్స్ కేసులో భార్యాభర్తలకు జైలు

రాంగోపాల్‌పేట్: నెక్లెస్ రోడ్డుకు వచ్చే పర్యాటకులపై అనుచితంగా ప్రవర్తిస్తూ.. న్యూసెన్స్ సృష్టిస్తున్న భార్యాభర్తలపై సెక్రటేరియట్ పోలీసులు పెట్టీ కేసు నమోదు చేయగా.. కోర్టు వారికి 8 రోజుల జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పాటిగడ్డకు చెందిన భార్యాభర్తలు రేష్మాబేగం (40), ఫిరోజ్‌ఖాన్(55)లు తరచుగా నెక్లెస్ రోడ్డుకు వచ్చి భార్య పర్యాటకుల వద్దకు వెళ్లి యాచిస్తుంది. వారితో మాట్లాడుతుండగానే భర్త ఫిరోజ్‌ఖాన్ అక్కడికి వచ్చి భార్యతో గొడవపెట్టుకోవడంతో పర్యాటకులతో గొడవకు దిగుతాడు. ఇలా తరచుగా నెక్లెస్ రోడ్డుకు వచ్చి పర్యాటకులతో అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. గత నెల 29న ఇలాగే న్యూసెన్స్ సృష్టించడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి వారిని అదుపులోకి తీసుకుని సీపీ ఆక్ట్ 61బీ,ఐపీసీ 290, 70బీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు. ఈ మేరకు కోర్టు వారికి 8 రోజుల జైలుశిక్ష విధించింది.

పాతకక్షలతో యువకుడి హత్య



మృతుడు ఇమ్రాన్ (ఫైల్)



నిందితుడు సందీప్

కంటోన్మెంట్: మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో అతనికి పరిచయం ఉన్న వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏసీ టెక్నీషియన్‌గా పనిచేసే మహ్మద్ ఇమ్రాన్ (25) తన భార్య చలిమెల భార్గవి అలియాస్ సన (20)తో కలిసి మల్కాజిగిరి దయానంద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత వారం భార్య వెస్ట్ మారేడుపల్లి పిట్టల బస్తీలోని తన పుట్టింటికి వచ్చింది. గురువారం రాత్రి 10.00 గంటల సమయంలో పిట్టల బస్తీలోని అత్తగారింటి నుంచి ఇమ్రాన్ సిగరెట్ తాగి వస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో భార్గవి పక్కింటికి చెందిన వ్యక్తి, ఇమ్రాన్ రోడ్డుపై రక్తపు మడుగులో పడిఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతో వెంటనే ఇమ్రాన్‌ను అంబులెన్స్ ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సందీప్ బహదూర్ అనే వ్యక్తి రాత్రి 11.15 గంటల సమయంలో తన భర్తకు ఫోన్ చేశాడని భార్గవి పోలీసులకు తెలిపింది. పాత కక్షల నేపథ్యంలో అతడే తన భర్తను చంపి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పురాతన వారసత్వాన్ని కాపాడుకోవాలి

భావితరాలకు అందించాలన్న వక్తలు

బన్సీలాల్‌పేట్: మన పూర్వీకులు ఎంతో కష్టపడి కాపాడిన వారసత్వ సంపద, పురాణాలు, సంస్కృతిని కాపాడుతూ భావితరాలకు అందించాలని పలువురు వక్తలు సూచించారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ మెట్లబావి వద్ద శుక్రవారం రాత్రి ఎఫ్‌ఐసీసీఐ మహిళా ఆర్గనైజేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్ రీతూషా, కల్పనా రమేష్, అక్షత్ గుప్తా తదితరులు మాట్లాడారు. భగవంతుడి పూర్తి రూపం నేల, ఆకాశం, గాలి, అగ్ని, నీరు అని పేర్కొన్నారు. మెట్ల బావులకు ఎంతో చరిత్ర ఉందని, అవి నాటి చరిత్ర ప్రాముఖ్యతను తెలియజేస్తాయని చెప్పారు. దేశంలో అనేక వందల ఏళ్ల నాటి 3000 మెట్ల బావులు ఉన్నాయని, వాటిలో తెలంగాణలోనే సుమారు 300 మెట్ల బావులు ఉన్నాయని వివరించారు. 18 నెలల కృషి తర్వాత బన్సీలాల్‌పేట్ మెట్ల బావికి పూర్వ వైభవం తీసుకొచ్చామన్నారు. ఈ బావి కొన్ని కోట్ల వరకు నీటిని నిల్వ చేయగలదన్నారు. బన్సీలాల్‌పేట్ మెట్ల బావి పునరుద్ధరణ గురించి ఢిల్లీలో చర్చ జరిగిందన్నారు. నీరు ఒక అందమైన సహజ వనరు అని అభివర్ణించారు. ఈ సందర్భంగా మిథాలజీ, హెరిటేజ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా కథక్ కేంద్రం నిర్వహించిన మహిషాసుర మర్దిని స్తోత్రం ప్రేక్షకులకు ఎంతో ఆకట్టుకుంది.



ప్రజాధనం వృథా



ఆలుగడ్డబావి రైల్వే వంతెన వద్ద నిరుపయోగంగా వాటర్‌ఫాల్స్ కట్టడం..

నిరుపయోగంగా జలప్రవాహ కట్టడం

- రూ.90 లక్షలతో ఆలుగడ్డ కూడలిలో ఏర్పాటు

సికింద్రాబాద్: జిమ్‌లు, పార్కులు, బయో టాయ్‌లెట్లు ఇలా జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులు ఏవైనా సరే ఏడాది లోపే లోపభూయిష్టంగా మారుతున్నాయి. ఒక ఏడాదిలో ఆర్భాటంగా ప్రారంభించిన అభివృద్ధి పనులు మరుసటి ఏడాది మరుగున పడుతున్నాయి. ఒక్కో అధికారి నేతృత్వంలో ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతలు సదరు అధికారి విధుల్లో ఉన్నంత వరకే కొనసాగుతున్నాయి. అధికారుల బదిలీ జరిగిందంటే చాలు క్రమేణా పాత అభివృద్ధి పనుల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. మళ్లీ కొత్త అధికారులు పనులపై దృష్టి సారించడం మినహా పాత వ్యవహారాలను కొనసాగించేందుకు శ్రద్ధ కనబరచడం లేదు. ఇలాంటి వ్యవహారాలతో రూ.కోట్ల ప్రజాధనాన్ని మట్టిపాలు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలతో మరుగున పడిపోయిన అభివృద్ధి పనులు సికింద్రాబాద్ ప్రాంతంలో ఎన్నో ఉన్నప్పటికీ తాజాగా కాలగర్భంలో కలిసిపోతున్న జాబితాలో మెట్టుగూడ సమీపంలోని ఆలుగడ్డబావి కూడలిలోని వాటర్ ఫాల్స్ కట్టడం.

మూడేళ్ల క్రితం లాంఛనంగా..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల సుందరీకరణ పనుల్లో భాగంగా ఆలుగడ్డ బావి వంతెన కూడలిని జీహెచ్‌ఎంసీ అధికారులు సుందరీకరించారు. సంగీత్‌కూడలి, మెట్టుగూడ, చిలకలగూడ కూడలికి వెళ్లే మార్గంలో ఉన్న ఆలుగడ్డబావి కూడలిలో రూ.90 లక్షలు వెచ్చించి వాటర్‌ఫాల్స్‌ను ఏర్పాటు చేశారు. పలు రైళ్ల రాకపోకలు సాగించే ఆలుగడ్డబావి రైల్వేట్రాక్‌ను ఆనుకుని వాటర్‌ఫాల్స్‌ను నిర్మించారు. ఈ కట్టడం మీదుగా నిరంతరం జలప్రవాహాలు కొనసాగేందుకు నీటి సరఫరాను ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో ఈ కూడలి గుండా వెళ్లే వాహనదారులకు కనువిందు చేసేందుకు రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

ఆరునెలలు గడవక ముందే..

కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ జల ప్రవాహం వాహనదారులకు కనువిందు చేసింది. నిజంగానే అధికారులు చెప్పినట్టు రాత్రి సమయాల్లో ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలు, ట్రాక్‌ను ఆనుకుని విద్యుత్‌దీపాల మధ్య జలప్రవాహాలు ప్రయాణికులకు కనువిందు చేశాయి. క్రమేనా విద్యుత్ దీపాల కాంతులు నిలిచిపోయాయి. ఈ సాకుతో ఉదయం సాయంత్రం వరకే జల ప్రవాహాలను కొనసాగించారు. ఆ తర్వాత మోటార్ల సమస్యల కారణంతో మొత్తంగా జలప్రవాహాలే నిలిచిపోయాయి. తాజాగా నీటి ప్రవాహాల కోసం నిర్మించిన ఎత్తైన కట్టడాలు ధ్వంసం అవుతున్నాయి. అప్పట్లో నాటిన నాలుగు మొక్కలకు నీళ్లు పోయడం తప్పా.. ఈ కట్టడాన్ని పరిరక్షించడం, నీటి ప్రవాహాలను కొనసాగించడం కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం కావడం గమనార్హం.

సరైన సమాధానం లేదు..

పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి నిర్మించిన వాటర్‌ఫాల్స్ నిరుపయోగంగా నిలిచిపోయిన తీరుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. దీన్ని నిర్మించిన అధికారులు బదిలీపై వెళ్లిపోగా.. వారి స్థానంలో వచ్చిన కొందరు అధికారులు సదరు నిర్మాణం ఎక్కడ ఉందో కూడా తెలియకపోవడం కొసమెరుపు.

పోలీసుల తనిఖీలు



రాంగోపాల్‌పేట్: బెంగుళూరులోని ఓ కేఫ్‌లో శుక్రవారం జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో నగరంలో పోలీసులు విస్తతంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మహంకాళి డివిజన్‌లోని మార్కెట్, మహంకాళి, రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏసీపీ రవీందర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ థియేటర్, ఆదయ్యనగర్, పాలికాబజార్ ప్రాంతాల్లో ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సిబ్బంది కలిసి అనుమానిత కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాణిగంజ్ చౌరస్తా, రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీజీరోడ్ షాలినీ చౌరస్తాలో అనుమానిత వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పలు లాడ్జీల్లో కూడా పోలీసులు సోదాలు చేసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ మాట్లాడుతూ.. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, వ్యాపారులు కూడా ఎలాంటి అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ రొనాల్డ్‌రాస్‌తో కార్పొరేటర్ కొంతం దీపికా

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపికా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిశారు. డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కారించాలని శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మోండా మార్కెట్‌లో శానిటేషన్ పరిస్థితి దయనీయంగా ఉందని, ఎక్కడ పడితే అక్కడ చెత్త, చెదారం ఇతరత్రా వ్యర్థాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. డివిజన్ జీహెచ్‌ఎంసీ పరంగా పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేలా సదరు విభాగం అధికారులను ఆదేశించాలని కోరారు. మోండా డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పలు సమస్యలను గుర్తించడంతో పాటు స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణే అమరులకు నిజమైన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించి మాదిగ అమరులకు నిజమైన నివాళులర్పిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతి అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కులకోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన వీరులు ఎల్లప్పుడూ.. మాదిగ ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారన్నారు. గత పాలకులు చేసిన మోసం, నిర్లక్ష్యం, ద్రోహం వల్లనే మాదిగ బిడ్డలు యుద్ధంలో నేలకొరిగారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, ఎంఎస్పీ నాయకులు రాగటి సత్యం, సోమశేఖర్, ఇనుముల నరసయ్య, టీవీ.నరసింహారావు, డప్పు మల్లికార్జున్, బుర్ర భిక్షపతి, రవి, కిషన్, వీఎస్.రాజు, సత్యనారాయణ, శేఖర్, సతీష్, శ్రీనివాస్, శివప్రసాద్, సుజాత, రేణుక, రామదాసు, సాయికుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: ఎస్సీ వర్గీకరణ సాధనే అమరవీరులకు నిజమైన నివాళి అని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. గురువారం బోయిన్‌పల్లి మార్కెట్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణను సాధించి అమరులకు ఘన నివాళి అర్పిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మంద మధుకర్‌మాదిగ, కళ్యాణ్ అజిత్ వాల్మీకీ, బ్యాగరి నర్సింహ, విష్ణు, మక్కల అశోక్, బండి రాజు, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో దండోర ఉద్యమంలో మాదిగ అమరులకు నివాళులర్పించారు. శుక్రవారం మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వేర్వేరుగా ఏర్పాటు చేసిన అమరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాదిగల అమరుల స్ఫూర్తితో వర్గీకరణ సాధిస్తామని ఈ సందర్భంగా విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, గోవిందు నరేష్, జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

పెరోల్‌పై బయటికి వచ్చిన నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్ రెడ్డి

బౌద్ధనగర్: ఓ మర్డర్ కేసులో పెరోల్‌పై బయటకు వచ్చి పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్న ఓ నిందితుడిని వారాసీగూడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్సై సుధాకర్‌లతో కలిసి ఏసీపీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యం తిలక్ అలియాస్ తిలక్‌రాజ్(40) 2003 సంవత్సరంలో శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో కోర్టు 2005లో 14 ఏళ్ల జైలుశిక్షను కోర్టు విధించింది. గత కొంత కాలంగా నిందితుడు నేరేడ్‌మెట్‌లోని వినాయక్ నగర్‌లో నివాసం ఉండేవాడు. అయితే 2020లో తిలక్‌రాజ్ 30 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చి జైలుకు వెళ్లకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. పోలీసుల కళ్లు గప్పేందుకు తన ఫ్యామిలీని కూడా ఊళ్లు మార్చుతూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గత మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న తిలక్‌రాజ్‌ను సోషల్ మీడియా యాప్స్ ద్వారా వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నట్లు జైలు అధికారులు గుర్తించారు. ఇటీవల చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసికున్న ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్సై సుధాకర్‌లు సిబ్బందితో కలిసి నిందితున్ని శుక్రవారం అల్వాల్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న బీజేపీ ప్రజా సంకల్పయాత్ర

అడ్డగుట్ట: దేశవ్యాప్తంగా ప్రజలు ప్రధాని మోదీ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సంకల్ప యాత్రను మారేడుపల్లి మండల కార్యాలయం నుంచి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారన్నారు. అడ్డగుట్ట చౌరస్తా వద్ద బీజేవైఎం యువ నాయకుల ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్ వరకు ర్యాలీగా వెళ్లారు. బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్‌వీఎస్‌ఎస్. ప్రభాకర్, సీనియర్ నాయకులు బండ కార్తీకరెడ్డి, మేకల సారంగపాణి, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు ఉదయ్ యాదవ్, కార్యదర్శులు శివాజీ, రాజేష్, చింటూ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో శాంతియుత పరిస్థితులు..

సికింద్రాబాద్: బీజేపీ ప్రభుత్వ ఏర్పాటైన తర్వాత దేశంలో శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర శుక్రవారం మధ్యాహ్నం సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడకు చేరింది. శివాజీ విగ్రహం వద్ద కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సోనియాగాంధీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశప్రజలు, దేశానికి భద్రత లేకుండా పోయిందన్నారు. దేశం అన్ని రంగాల్లో మరింత ప్రగతి సాధించడం కోసం నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, మహంకాళి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి, బీజేపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, మద్దెర్ల శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.



అడ్డగుట్టలో కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం..

బైక్ ర్యాలీ..

బౌద్ధనగర్: విజయ సంకల్ప యాత్ర సందర్భంగా ద్విచక్ర వాహన ర్యాలీని బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప్‌గౌడ్ ప్రారంభించారు. నేతి సత్యనారాయణ, దత్తు, వీఎస్.రాజు, హన్మంతు, పురుషోత్తం, చైతన్యకుమార్, నగేష్, భాస్కర్, శ్యామ్, వెంకటేష్, మోహన్, యాదగిరి, ఉమాపతి, కృష్ణ తదితరులున్నారు.

'బీఆర్‌ఎస్ చలో మేడిగడ్డ'పై కాంగ్రెస్ నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ నేతలు చలో మేడిగడ్డ పేరుతో అక్కడికి వెళ్లడం సిగ్గుచేటని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం అడ్డగుట్టలోని అంజయ్య విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్. యాదగిరి మాట్లాడుతూ.. 'ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దండుకున్న వారిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు'. ప్రజాధనాన్ని వృథా చేయడమే కాకుండా ఇప్పుడు 'చలో మేడిగడ్డ అంటూ.. మాయమాటలతో బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు'. ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆదరాభిమానాలు చూపిస్తున్నారని అభిప్రాయపడ్డారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు గౌతమ్, చిలుకమ్మ, లలిత, సునీత, వెంకటలక్ష్మి, సాలమ్మ, ఉమ, అరుణ, చందన, పద్మ, ఎల్లమ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు వెళుతూ.. వైద్యుడు మృతి

షాద్‌నగర్‌రూరల్: విధులకు వెళ్తున్న వైద్యుడు కిందపడి అకస్మాత్తుగా మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలోని నాగులపల్లి రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న జాన్‌పెజర్(50) షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న అమెరికన్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం విధులకు వెళ్లే క్రమంలో షాద్‌నగర్ బస్టాండ్‌కు వచ్చిన జాన్‌పెజర్ టిఫిన్ చేసేందుకు నాగులపల్లి రోడ్డుకు వచ్చాడు. నడుచుకుంటూ వెళ్తున్న ఆయన అకస్మాత్తుగా కిందపడి మృతి చెందారు. ఏఎస్సై రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. వైద్యుడు జాన్‌పెజర్‌కు గుండెపోటు రావడంతోనే మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య హవేలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు

వినతిపత్రం అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటును కోరుతూ శుక్రవారం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా కారణంతో మొదటి నుంచి సికింద్రాబాద్ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని మంత్రికి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు తుదివరకు వచ్చినట్టే వచ్చి ఆగిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అనంతరం బీజేపీ విజయ సంకల్ప యాత్ర వద్దకు చేరుకున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శైలేందర్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాయాలతోనే ఇంటర్ పరీక్షకు..

స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్.. బాలికకు ప్రథమ చికిత్స



రాంగోపాల్‌పేట్: బైక్ యాక్సిడెంట్ అయినా.. గాయాలతోనే ఓ విద్యార్థిని పరీక్ష కేంద్రానికి చేరుకుంది. ఆమె పరిస్థితిని చూసిన ఓ సీఐ ఆమెకు వైద్యం అందించి తిరిగి సకాలంలో ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. బాలంరాయి ప్రాంతానికి చెందిన భవానీ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసేందుకు తండ్రి బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరింది. సీటీఓ జంక్షన్ వద్ద వీరి బండి అదుపు తప్పి కిందపడిపోవడంతో బాలిక తలకు గాయాలై రక్తస్రావం జరుగుతోంది. పరీక్షకు సమయం దగ్గరపడుతుండటంతో తండ్రి వద్దని చెబుతున్నా.. గాయాలతోనే ప్యాట్నీ సెంటర్‌లోని తపస్యా జూనియర్ కాలేజీకి చేరుకుంది. అయితే, భవానీ కనీసం కూర్చునే పరిస్థితిలో కూడా లేదు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మానవత్వం

అదే సమయంలో మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ అక్కడే విధి నిర్వహణలో ఉన్నారు. గాయాలపాలైన భవానీని గమనించి.. తన వాహనంలో దగ్గరలో ఉన్న విజయ హెల్త్ కేర్‌కు తరలించారు. బాలికకు వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఆరు కుట్లు వేశారు. వెంటనే తిరిగి సీఐ తన వాహనంలో భవానీని పరీక్ష సమయానికి చేర్చారు. దీంతో ఇన్‌స్పెక్టర్ మానవత్వం, సమయస్ఫూర్తికి అంతా హాట్సాఫ్ చెప్పి అభినందించారు.